# సత్యమేవజయతే

దినకరుడు శాంతుడై తోచె దినములింక
కురుచనయ్యెను చలిగాలి చురుకు హెచ్చె
పొలములన్ రేయి గ్రుడ్డి వెన్నెలలలోన
కుప్పలన్ నూర్పు కాపులు గొంతులెత్తి
పదములన్ పాడదొడగిరి
పచ్చపూలు జనపచేలకు ముత్యాల సరులుగూర్చె
మిరప పండ్లకు కుంకుమ మెరుపుదాల్చి
బంతిపువ్వుల మొగములల్లంత విప్పి
మన గృహంబుల ధాన్యసంపదలు నిల్పి
సరసురాలైన పుష్యమాసంబువచ్చె.

మానవునకు అన్ని వస్తువలూ అవసరమే. కాని, ఈ ప్రపంచములో ఏదియును శాశ్వతము కాదు. అన్నీ కదలిపోయే మేఘములే! దేనిని మనము స్థిరమని అనుకుంటున్నామో అది అస్థిరమైపోతుంది. శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైనటువంటిదానిని పట్టవలెనన్న మనకు ఒకే ఒక మార్గమున్నది. 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః'. 'ఈ జగత్తులో అందరుకూడను నా అంశములే, అందరియందు నేనున్నాను' అని భగవద్గీత మానవాళికి బోధిస్తున్నది. I am in you, with you, around you, above you and below you. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించాలి. 'ఈశ్వర స్సర్వభూతానాం', 'ఈశావాస్య మిదం జగత్'. భగవంతుడు లేనటువంటి స్థానముగాని, భగవంతునిది కానటువంటి రూపముగాని జగత్తులో ఎక్కడా కనపడవు. కాని, మానవుడు ఈ సత్యాన్ని గుర్తించుకొనలేక, 'ఎక్కడ చూచినా నాకు మానవులే కనిపిస్తున్నారే! దేవుడు కనిపించటం లేదే!' అని భావిస్తున్నాడు. 'యద్భావం తద్భవతి'. నీవు అద్దం ముందు ఏ డ్రస్సు వేసుకొని నిలబడితే ఆ డ్రస్సే ఆ అద్దములో నీకు కనిపిస్తుంది. అదేవిధముగనే, నీయొక్క భావములు, నీయొక్క తలంపులే జగత్తనే అద్దములో ప్రతిబింబిస్తుంటాయి. అవి మంచిగాని, చెడ్డగాని వాటి 'రిఫ్లక్షన్, రియాక్షన్, రీసౌండ్'లు నీకే తిరిగి వస్తాయి. నీనుండి వచ్చే 'సౌండే' నీకు 'రీసౌండ్'గా తిరిగి వస్తుంది. నీవు ఏ మాటలు పలుకుతున్నావో అవే మాటలు తిరిగి నీకు 'రిప్లై'గా వచ్చేస్తాయి. 'వాడు మాట్లాడుతున్నాడు, వీడు చెబుతున్నాడు' అని మనము అనుకుంటున్నాము. కాని, వాడు, వీడు అనే భేదము లేదు, అందరూ ఒక్కటే! మనము చూచేటువంటివన్నీ మన రిఫ్లక్షన్లే! నీవు చూచే ప్రతి రూపముకూడను నీ ప్రతిబింబమే! నీకు ఏ రోగము వచ్చినప్పటికీ అది నీయొక్క రియాక్షనే! నీవు అనుభవించేవన్నీకూడను నీయొక్క రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్లే!

ఇక్కడ ఇన్ని వేలమంది చేరారు. కాని, అందరి హృదయమందు వున్నది ఒక్కటే! హృదయమంటే ఫిజికల్ హార్టు కాదు. స్పిరిచువల్ హార్టు. కాని, ఈనాడు ఈ స్పిరిచువల్ హార్టును ఈనాడు చాలామంది నమ్మలేకపోతున్నారు. ఈనాడు మీరు అనేక చదువులు చదువుతున్నారు.

చదువులన్నియు చదివి చాల వివేకియై
మదిని తన్నెరుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏరీతినున్నను
హీనుడవగుణంబు మానలేడు.

తరచి చదువు చదువ తర్కవాదమెగాని
పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు
చదువులన్ని చదివి చావంగనేటికి
చావులేని చదువు చదవవలయు.

ఈ చదువులు కాదు మనము చదవవలసినవి. ఇవన్నీ భౌతికమైన చదువులు. ఇవి అధ్యాపకుల నుండి నేర్చుకొనేవి. మనము చదివే చదువులుగాని, మాట్లాడే మాటలుగాని, చెప్పే ఉపన్యాసాలుగాని కేవలం బాహ్యమైనవి. అన్నింటికినీ ఆధారమైనది మనలోపల ఒకటున్నది. దానికి సంబంధించినదే 'ఎడ్యుకేర్'. అది మనకు కనిపించేది కాదు. 'ఎడ్యుకేర్' అనే పదమునకు 'లోపలినుండి వెలికి తీయటము' అని అర్థము. సత్యము ఎక్కడున్నది? మన హృదయములోనే వున్నది. దానిని ప్రయత్నపూర్వకంగా సాధించాలి. అదే 'ఎడ్యుకేర్'. శాంతి ఎక్కుడున్నది? బయట వున్నదా? లేదు, లేదు. ఒకరితోనొకరు పోట్లాడటంవల్ల బయట అనేకరకములైన అల్లర్లు

జరుగుతున్నాయి. బయట అంతా అశాంతే! శాంతి మనలోనే వున్నది. అట్లే, ప్రేమ అనేది మనకు కనిపించేది కాదు. అదికూడా మన హృదయములోనే వున్నది. 'ప్రేమయే దైవం, ప్రేమలో జీవించాలి'. ఇదే 'ఎడ్యుకేర్'. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస– ఇవే మన పంచప్రాణములు. హృదయంలో ప్రేమను పెట్టుకొని మీరు సత్యము ననుసరించండి. ఈ సత్యము శాశ్వతమైనది. సత్యమే దైవం. ఎక్కడికి పోయినప్పటికీ, ఏ కాలమైనప్పటికీ, ఏ దేశమైనప్పటికీ సత్యము మారేటటువంటిది కాదు. కనుక, సత్యమును అనుసరిస్తూ మీ హృదయంలో ప్రేమను ప్రకాశింపజేసుకోండి.

నీవు ఒక వ్యక్తిని చూచినప్పుడు ప్రాపంచిక దృష్టిలో 'అతను నా ద్వేషి' అనుకుంటావు. కాదు, కాదు. అతనుకూడా నీవే! కనుక, నీవతనిని ద్వేషిస్తే నిన్ను నీవే ద్వేషించుకుంటున్నావు. అతనిని కొడితే నిన్ను నీవే కొట్టుకుంటున్నావు. ఈ ప్రపంచములో వున్నది ఒక్కటే. రెండవది లేనే లేదు. ఈ సత్యాన్ని మనం మొట్టమొదట గుర్తించి అనుసరించాలి. ఈనాటి ప్రపంచమునందు సత్యమనేది ఎక్కడా కనిపించటం లేదు. విద్యార్థులయందుగాని, రాజకీయములందుగాని సత్యము అసలు కనిపించటం లేదు. అందువల్లనే అందరూ కోర్టులకు పోతున్నారు. కాని, అక్కడకూడా తిరిగి అసత్యమే చెబుతున్నారు. అసత్యముకోసమని ఎంతో ధనము ఖర్చుపెడుతున్నారు. అయితే జయము మాత్రము సత్యమునకే! సత్యమునకు ఏదీ ఖర్చుపెట్టనక్కరలేదు. ప్రేమ ఒక్కటి మాత్రమే చాలు. నీ ద్వేషి నీకు ఎదురు వచ్చినప్పుడు 'నమస్కారమండీ' అను. అతనుకూడా నీకు నమస్కారమంటాడు. నీ భావము ఎట్టిదో ఎదుటివానిలోకూడా అట్టి భావమే ప్రతిబింబిస్తుంది.

ప్రపంచములో ఈనాడు ఎక్కడ చూచినా శాంతి అనేదే కనిపించటం లేదు. నలుగురు వ్యక్తులు చేరితే అక్కడ ఒక గలాటా! మార్కెట్‌లో గలాటా! బజార్లో గలాటా! షాపుకుపోతే గలాటా! హోటలుకుపోతే గలాటా! ' ఈ ఇడ్లీ సరిలేదు, ఆ దోశ సరిలేదు, ఈ వడ సరిలేదు' అని అక్కడకూడా గలాటా! అంతా సరిలేదు, సరిలేదు, సరిలేదు. జగడములేనటువంటి స్థానము ఎక్కడా కనిపించటం లేదు. శాంతి అనే పదము వినటానికికూడా మనకు వీల్లేకుండా వుంది. కాని, ఇక్కడ చూడండి, ఈ హాలులో ఎంత ప్రశాంతంగా వున్నది. ఈ శాంతి, ఈ ప్రేమ మరెక్కడా కనిపించవు.

అసలు మీరు భగవంతుని దగ్గరకుపోయి ప్రార్థించటం దేనికోసం? శాంతికోసమని, ఆనందముకోసమని, ప్రేమకోసమని మనము ప్రార్థించాలి. పుట్టపర్తిలో, బృందావనములో చదివిన మా పిల్లలు దేశమంతా చుట్టారు, విదేశాలకుకూడా వెళ్ళారు. కాని, ఎక్కడికిపోయనా వారికి ఒక్క క్షణమైనా మనశ్శాంతి లేదు. మీరు శాంతికోసం బయట వెతికితే ప్రయోజనం లేదు. శాంతి మీయందే వున్నది. సత్యము, ప్రేమ రెండుకూడను మీయందే వున్నవి. ప్రేమ ఒక్కటి వుంటే మనము సర్వమూ సాధించవచ్చును. ప్రేమయే స్వామికి ఉన్న పెద్ద ప్రోపర్టీ! ఈ ప్రేమను అందరికీ అందించటమే నా కర్తవ్యము. ఈ ప్రేమకు సరియైన అర్థము తీసుకొని, దీనిని పవిత్రమైన మార్గంలో వినియోగించుకుంటే మీరు ఎంతో బాగుపడతారు. ప్రేమ తప్ప మరి ఏఒక్కటీ మనల్ని రక్షించలేదు. కనుక, ఈ ప్రేమతత్త్వాన్ని అందరూ తెలుసుకోవాలి. అందరూ సిస్టర్స్ అండ్ బ్రదర్సే! కాని, ఈనాడు బ్రదర్స్ అండ్ సిస్టర్స్‌లో కూడను భేదములు ఏర్పడుతున్నాయి. కనుక, మనం ప్రధానంగా నేర్చుకోవలసింది ప్రేమతత్త్వము. అప్పుడే మన జీవితము ఉన్నతమైన, ఆదర్శవంతమైన జీవితంగా తయారౌతుంది. ఎప్పుడు చూచినా మీరు ఆనందంగా వుండాలి. నవ్వుతూ, నవ్వుతూ వుండాలి. 'క్యాస్ట్రాయిల్ ఫేస్' పెట్టకూడదు. ఎందుకంటే, మనకేమి తక్కువ! అన్నీ మనలోనే వున్నాయి. కాని, కొంతమంది కష్టములు వచ్చినప్పుడు భరించుకోలేరు. ఐతే, కొంచెము ఓపిక పట్టుకుంటే తప్పక ఆ కష్టములు కూడను ఆనందాన్నిస్తాయి. Pleasure is an interval between two pains.

మీరు పుస్తకాలు చదువుతున్నారు. కాని, ఎన్న పుస్తకాలు చదివినప్పటికీ మీ మస్తకమే సరిలేకపోతే అంతా నిరర్థకమే! మస్తకము చాలా ప్రధానమైనది. మస్తకమును పవిత్రము గావించునదే 'ఎడ్యుకేర్'. ఒక్కొక్క పర్యాయము మీ మనస్సే మీకు విరుద్ధంగా మారుతుంటుంది. మీయొక్క భావమే ఆవిధమైన మార్పు తెప్పిస్తుంది. 'రిఫ్లక్షన్, రియాక్షన్, రీసౌండ్' ఈమూడింటికి కారణం మీ మనస్సే. ప్రతి ఒక్కటికూడను మంచిగాని, చెడ్డగాని మనలోనే వున్నాయి. బయటి ప్రపంచములో ఎక్కడా ఏమీ లేదు. నీ దృష్టి చెడ్డగా వున్నప్పుడు చెడును చూస్తావు. నీ మనస్సు మంచిగా వున్నప్పుడు అంతా మంచిగానే కనిపిస్తుంది. సత్యము, ప్రేమ –;ఈ రెండింటినీ వదలిపెట్టి మనము దేనియందు ప్రవేశించినా అక్కడ అన్నీ భేదాలే కనిపిస్తుంటాయి.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! మీరు ఇక్కడ చదువుకొని ఎంతో దూరంపోయి, ఎన్నో దేశాలు తిరిగి, ఇప్పుడు వచ్చి ఈవిధంగా స్వామిని తలుచుకుంటున్నారంటే, ఇది నిజంగా మీ అదృష్టమే! దీనికంతటకీ ప్రేమ ఒక్కటే కారణం. లేకపోతే, మీరు ఇంత ఖర్చులు పెట్టుకొని, ఇన్ని శ్రమలకోర్చి మీమీ కుటుంబాలతో ఇక్కడికి రావటానికి వీలవుతుందా? ఇది ఎంత అదృష్టము! ఈ సత్యాన్ని మీరు గుర్తించి వర్తించాలి. మీరు బృందావనములో చదివారు, ప్రశాంతినిలయంలో చదివారు. మీరు ఎక్కడికైనా వెళ్ళినప్పుడు 'ఎక్కడనుండి వచ్చారు?' అని ఎవరైనా మిమ్మల్ని అడిగితే, 'మేము ప్రశాంతినిలయమునుండి వచ్చాము', 'మేము

బృందావనమునుండి వచ్చాము' అని మీరు చెబుతారు. అయితే, అది కేవలం మీ తృప్తికోసం మీరు చెప్పుకోటమేగాని, నిజానికి ప్రశాంతినిలయం మీలోనే వుంది. బృందావనం మీలోనే వుంది. అన్నీ మీయందే వుంటున్నవి. ఆత్మతృప్తి కావాలంటే అంతా ఒక్కటే అని భావించాలి.

మతములన్నియు వేరు, మార్గంబు ఒక్కటే
వస్త్ర భేదము వేరు, వస్తువొక్కటె
శృంగారములు వేరు, బంగారమొక్కటే.

చెవులకు పెట్టుకొనేవాటిని 'కమ్మల'న్నారు. చేతులకు వేసుకొనేవాటిని 'గాజుల'న్నారు. మెడలో వేసుకొనేదాన్ని 'చైన్' అన్నారు. కాని, బంగారు ఒక్కటే కదా! అట్లే, 'పశుల వన్నెలు వేరు, పాలు ఒకటె'. ఒక ఆవు తెలుపు కావచ్చు, మరొక ఆవు నలుపు కావచ్చు, కాని, పాలు మాత్రం తెలుపే. అదేవిధముగనే, మనుష్యులందరూ వేరువేరుగా వున్నప్పటికీ హృదయములో అనుభవించే ఆనందము ఒక్కటే! అట్టి ఆనందాన్ని మనము అనుభవించాలిగాని, వ్యక్తిగతమైన భేదాలను ఏమాత్రం పెట్టుకోకూడదు. ఈ భేదాలు తాత్కాలికంగా వచ్చిపోయేటు వంటివి. ఇవన్నీ మన మనస్సుయొక్క 'రియాక్షన్, రిఫ్లక్షన్, రీసౌండ్'లే!

ఉన్నది ఒక్కటే. ఆ దివ్యత్వమే కృతయుగములో వామనమూర్తిగాను, త్రేతాయుగములో రామునిగాను, ద్వాపరయుగంలో కృష్ణుడుగాను అవతరించింది. కాబట్టి, ముగ్గురూ ఒక్కటే. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ ఒక్కటే. ఈ పేర్లన్నీ కేవలం రూపమును బట్టి గుర్తుకోసం పెట్టుకున్నాము. కాని, అందరిలో వుండేది ఒక్కటే. అదే 'నేను'. 'నీ పేరేమిటి?' అని నిన్ను అడిగితే ఏదో ఒక పేరు చెబుతావు. ఆ పేరు నీ తల్లిదండ్రులు వాళ్ళ గుర్తుకోసం పెట్టుకున్నదేగాని నీవు పెట్టుకొని రాలేదు. పేర్లు మధ్యలో పెట్టినటువంటివి. ఇవి పెట్టిన పేర్లేగాని పుట్టినవి కావు. ఈ పేర్లను ఆధారం చేసుకొని రూపములుగా నీవు చూస్తున్నావు. అసలు ఎవరిని చూచినా దైవంగా భావించాలి. నీవు బజార్లో వెడుతుంటే ఒక బెగ్గరు ఎదురుగా వచ్చాడనుకో అతనుకూడా దైవమే, భగవంతుడే! ఆ రూపములో వున్నాడు. కనుక, అతనికికూడా నమస్కారము చేయి. తప్పులేదు. అందరికీ అనంతకోటి నమస్కారములు అర్పించు. అందరూ ఒక్కటే. అందరినీ సమదృష్టితో చూడాలి. బీదవాడుగాని, షాహుకారుగాని అందరినీ మనము ప్రేమించాలి.

ఈ సంవత్సరంలో భౌతికంగా చాలా మార్పులు కలుగుతాయి. కాని, ఆధ్యాత్మికంగా ఎప్పటికీ మార్పు రాదు. లౌకికంగా కొన్ని ద్వేషములు వస్తుంటాయి. కొన్ని కలహములు వస్తుంటాయి. అనేకరకములైన పార్టీలు వస్తుంటాయి. పార్టీ, పార్టీ– ఫర్ టీ! అయితే, మనము విభేదాలను విడనాడి అంతా ఒకటిగానే చూచుకోవాలి. దానివల్ల మనకు సౌఖ్యం చిక్కుతుంది. కష్టము వచ్చినా, దుః ఖమొచ్చినా అది తాత్కాలికమే. తప్పక మంచి జరుగుతుంది. మన కష్టములన్నీ మనకు సుఖమునిచ్చేకోసమే వస్తున్నాయి. రెండు బాధల మధ్యలోనే ఒక సుఖము వస్తుంది. కనుకనే, ప్రతిదానికి మంచిచెడ్డలు రెండూ వుండాలి. ఆ రెండింటినీ సమత్వంగా చూచుకోటమే మానవునియొక్క ప్రధాన కర్తవ్యము.

మనస్సు ఆహారవిహారములచే అనేకరకములుగా మార్పుచెందుతుంటుంది. mind is a mad monkey. మామూలు కోతి కాదు, పిచ్చికోతి. అసలు మనస్సు 'మేన్‌కైండ్'కి సంబంధించినది. కాబట్టి, అది కైండ్‌నెస్‌తో నిండివుండాలి. కాని, దానిని మనం మంకీమైండ్‌గా మార్చుకుంటున్నాము. మనిషి మనిషిగా జీవించాలి. మనకు తెలియకుండా ఎవరైనా కీడు చేసినప్పటికీ, మనము కీడు చేయకూడదు. వాడు చేసుకుంటే చేసుకోనీగాని మనం వానికి కీడు సల్పకూడదు. నా సందేశమిదియే! ఇప్పుడు ఈ దేహానికి 82సంవత్సరములు. ఇంతవరకు నేను ఒక్క క్షణమైనా ఎవ్వరినీ యేమాత్రం బాధపెట్టలేదు. ఎవ్వరికీ కీడు చేయలేదు. ఎవ్వరికీ అపకారం చేయలేదు. ఎవ్వరికీ అన్యాయం చేయలేదు. అసత్యమాడలేదు. ఎప్పుడూ సత్యమే, సత్యమే! అసత్యం చెప్పాలంటే చాలా కష్టపడవలసి వస్తుంది. కనుక, మీరెప్పుడూ సత్యమార్గంలో నడవండి. తప్పక మీకు జయము కలుగుతుంది. అందరినీ ప్రేమతో చూడండి. 'అది మాచేత కాద'ని మీరంటారు. కాని, అదే చాలా సులభమైన మార్గము. ప్రేమించటం చాలా సులభం. ద్వేషించటమే చాలా కష్టం. అందరినీ ప్రేమిస్తే అన్నివిధాలుగా సమత్వము ఏర్పడుతుంది. అప్పుడే అందరూ ఏకమైపోతారు. 'యూనిటీ' వుండినప్పుడే 'ప్యూరిటీ' వస్తుంది. 'ప్యూరిటీ' వుండినప్పుడే 'డివినటీ' ఆవిర్భవిస్తుంది. కనుక, 'డివినిటీ' కావాలనుకుంటే 'యూనిటీ' కావాలి. 'యూనిటీ' కావాలంటే మన సంకుచితమైన వ్యక్తిత్వాన్ని మరచిపోయి అందరూ ఏకం కావాలి. మీ అందరికీ కూడను ఆ 'డివైన్ పవర్' వుంది. 'డివైన్‌పవర్' లేని మానవుడే లేడు. కాని, దానిగురించి మీరు యోచించటం లేదు. మీ మనసంతా మానవత్వంపైనే పోతున్నాది. మనసు మానవత్వంపై పోకూడదు. ఎటువంటి పరిస్థితియందైననూ దైవంపైననే ఉండాలి.

కొందరు నన్ను అడుగుతుంటారు, 'స్వామీ! యూనిటీ ఎట్లా సాధ్యమౌతుంది?' అని. యూనిటీ అనేది మనయొక్క స్వభావమే. 'నేను వేరు, ఇతను వేరు, అతను వేరు' అని అనుకుంటున్నకొద్దీ మనకు డివినిటీ దూరమౌతుంది. నీవు, అతను, ఇతను అందరూ కలసి ఒకటే అనుకో. 'ఈయన నా ఫాదర్, ఈమె నా మదర్, ఈమె నా సిస్టర్' అంటావు. ఈ సంబంధబాంధవ్యాలన్నీ

కేవలం భౌతిక స్థాయిలో ఏర్పడినవేగాని, నిజంగా ఎవరూ నీ ఫాదర్ కాదు, మదర్ కాదు, సిస్టర్ కాదు. వివాహం చేసుకోవటం వల్ల భార్యాభర్తలు అనుకుంటున్నారుగాని, లేకపోతే భార్య ఎవరు, భర్త ఎవరు? ఇవన్నీ మీకై మీరు కల్పించుకున్నవే. అయితే, ఆ సంబంధము వున్నంతవరకు దాన్ని అనుసరించి మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించాలి. అందులోకూడను ఎవ్వరినీ బాధపెట్టకూడదు. తిట్టకూడదు. భార్యకదాయని ఆమెను కొట్టకూడదు, తిట్టకూడదు. ఏదైనా తప్పు జరిగినప్పుడు 'ఫలానా తప్పు నీలో వుంది' అని చెప్పవచ్చును. అంతేగాని, వాళ్ళని తిట్టటం, కొట్టటం రాక్షసత్వమే.

పిల్లలారా! మీరెంతో ప్రేమతో వచ్చారు. మీ హృదయాలను ప్రేమతో నింపుకోండి. ఏవిషయము వచ్చినప్పటికీ సత్యాన్నే చెప్పండి. సత్యము చెబుతూ వస్తుంటే మనకు కొన్ని అడ్డంకులు వస్తుంటాయి. ఎన్ని వచ్చినా ఫరవాలేదు, సత్యాన్నే చెప్పండి. అప్పుడే మనకు జయము కలుగుతుంది. ఒక చిన్న విషయము. ఒక పర్యాయం బెంగుళూరులో ఒకామె 'గోల్డ్ ఛైన్'ను ఒక దొంగ ఎత్తుకొనిపోయాడు. తరువాత ఆ దొంగ చిక్కినాడు. పోలీసు ఆ గొలుసును ఆమెకు చూపించి, 'ఇది నీదేనా అమ్మా!' అని అడిగాడు. ఆమె, 'నాదే' అన్నది. 'దీనికి ఎన్ని రింగులున్నాయి?' అని అడిగాడు. 'అయ్యో, నేను రింగులు ఎంచుకోలేదు నాయనా!' అన్నది. 'నీవు ప్రతిరోజూ మెడలో వేసుకునే గొలుసుకి ఎన్ని రింగులున్నాయో తెలియదా? అయితే ఇది నీది కాదు'అన్నాడు. అప్పుడామె, 'అయ్యా! ప్రతిరోజూ నీవు గడ్డం గీసుకుంటున్నావు కదా! మరి నీ గడ్డంలో ఎన్ని వెంట్రుకలున్నాయో చెప్పగలవా?' అని అడిగింది. 'అట్లనే నేను ప్రతిరోజు ఈ ఛైన్‌ను మెడలో వేసుకుంటున్నాను. కాని, ఎన్ని రింగులో చూడలేదు' అన్నది. ఆమె భయపడలేదు. సత్యమే చెప్పింది. కాబట్టి, ఆ గొలుసు ఆమెకిచ్చేశాడు. కనుక, సత్యానికి మనం భయపడకూడదు. సత్యంకోసం 'ఫైట్' చేయాలి. ఆ సత్యమే నిలుస్తుంది. ఆ సత్యమే మనకు విజయాన్నందిస్తుంది. 'సత్యమేవ జయతే'. కనుక, మీరు సత్యాన్ని చెబుతూరండి. సత్యమార్గములో పయనించండి. ప్రేమమార్గంలో పయనించండి. ప్రేమే సత్యము. సత్యమే ప్రేమ. ఈ రెండింటినీ మీ రెండు నేత్రాలుగా భావిస్తే అన్నింటియందు మీరు విజయాన్ని సాధిస్తారు. ఈ రెండూ లేకుండా మీరు 'భక్తి, భక్తి, భక్తి' అని భగవంతుని ఊరకే కొలిస్తే ప్రయోజనం లేదు.

మీకు మంచి తెలివితేటలు వుండవచ్చు. 'నాలెడ్జి' వుండవచ్చు. కాని, విచక్షణాజ్ఞానం లేకుండాపోతే అంతా 'జీరో' అయిపోతుంది. కనుక, విచక్షణాజ్ఞానం చాలా అవసరం. ఏ పనైనా చేయటానికి ముందు 'ఇది తప్పా? ఒప్పా?' అని చూచుకోండి. మీ అంతరాత్మకు, 'ఇది రైట్' అనిపిస్తే తప్పక దానికోసం మీరు ఫైట్ చేయండి. ఇప్పుడు లోకమంతా స్వార్థస్వప్రయోజనాలతో నిండి వుంది. ఎప్పుడూ అపజయమే! మీరు సత్యమార్గమును, ప్రేమమార్గమును అనుసరించి అన్నింటియందు విజయాన్ని పొందండి. సత్యసాయి కాలేజి స్టూడెంట్స్ అందరుకూడను ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలి. 'ఫలాని సత్యసాయి స్టూడెంట్ మంచివాడు' అని మీరు పేరుతెచ్చుకుంటే, నాకదే ఆనందము. నాకంతకంటే మీరు ఇవ్వవలసినది యేమీలేదు. మీరందరూ మంచిపేరు తెచ్చుకోండి. అదే మీరు నాకివ్వవలసిన పెద్ద బహుమతి. అయితే, నాకోసం కాదు. మీ మంచికోసం మంచిపేరు తెచ్చుకోండి బంగారూ! మీరందరూ ఐకమత్యముతో వుండి, దైవచింతన చేస్తూ వుంటే మీలో పవిత్రత ఏర్పడుతుంది. అప్పుడు తప్పక స్వామి మీరున్నచోటికే వచ్చి దర్శనమిస్తాడు. నేను మీవాడిని. మీరందరూ నావారలే! నాకెవరిపట్లకూడను భేదభావము లేదు. భేదభావము చాలా చెడ్డది. ఏదో ప్రాపంచికంగా కొన్నికొన్ని విషయాలలో 'నీది, నాది' అంటాము. అంతేగాని మనలోపల భేదములు యేమాత్రమూ వుండకూడదు. ఎక్కడ వుండినప్పటికీ భగవన్నామాన్ని మనసులో మరువకండి. రామా, కృష్ణా, జీసస్, అల్లా... ఏ పేరైనా స్మరించండి. పేర్లు వేరైనప్పటికీ భగవంతుడు ఒక్కడే. 'సహస్ర శీర్షాపురుషః సహస్రాక్షః సహస్ర పాద్'. కనుక, భగవంతుని మీ హృదయములో పెట్టుకొని సత్యాన్ని అనుసరించండి. సత్యము, ప్రేమ– ఈ రెండింటినీ మీరు భద్రంగా పెట్టుకోండి.

భజనలో వున్నటువంటి ఆనందము ఇంకదేనియందుకూడా వుండదు. అందువల్లనే, భజనలు చేయటం చాలా అవసరం. ఒకరు విన్నా, వినకపోయినా మన ఆనందము మనదే. 'ఫాలో' చేసేవారు లేకపోయినా మనకు మనమే 'ఫాలో' చేసుకుందాము. చాలా సంతోషము. ఎక్కడికైనా వెళ్ళండి. స్వామి దయ దండిగా వుంది. రేపు అందరికీ ప్రసాదము ఇస్తాను. ఆనందంగా మీరు తిరిగి వెళ్ళండి.

(1.1.2008 సాయంత్రం సాయికుల్వంత్ హాల్‌లో పూర్వవిద్యార్థులకు భగవాన్ బాబావారి దివ్యసందేశము)